## ఈ దేశం తాకట్టుపెట్టబడిందని, తాకట్టు పెట్టింది ఈ దోపిడీ పాలకవర్గాలే అని

# న్యాయస్థానాల సాక్షిగా గర్జించిన కా॥నాగిరెడ్డి

విశ్వం



**బ్రిటీష్** వలసవాదులు ఈ దేశ ప్రజానీకపు మూల్గులను సైతం పీల్చివేసి భారతదేశ సంపదను తమ దేశానికి 200 సం॥పాటు యధేచ్ఛగా తరలించుకుపోయారు. దీనికి వ్యతిరేకంగా అకళంక దేశభక్తుల, వీరకిశోరాల నేతృత్వంలో మహోగ్రమైన జాతీయ విప్లవం నడిచింది. ఈ దోపిడీని చిలకమర్తి "భరత ఖండంబు చక్కని పాడి ఆవు" పద్యంలో అత్యంత చక్కగా విశదీకరించారు. ఈ దేశ ప్రజానీకం ఎంతటి తీవ్రమైన ఆర్థిక దోపిడీకి గురి అవుతున్నా రన్నదీ అత్యద్భుతంగా విశదీకరించారు. ఈ సామ్రాజ్యవాద ఆర్థిక దోపిడీకి వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటాలన్నింటిని విద్రోహ కుమ్మక్కు ద్వారా అణచివేసిన ఈ దేశపు బడా బూర్జువా, భూస్వామ్యవర్గాలు తెల్లదొరల స్థానంలో నల్లదొరలై ఈ దేశాన్ని దోపిడీ చేసుకొమ్మని గేట్లు బార్లా తెరిచి సామ్రాజ్యవాదుల్ని ఆహ్వానించారు.

అధికార మార్పిడి జరిగిన 50 సంవత్సరాల తర్వాత స్వర్ణోత్సవ సంబరాలలో మునిగి తేలుతున్నట్లు నటిస్తున్న ఈ పాలకవర్గాలు ఈ దేశపు ఆర్థిక వ్యవస్థ తీవ్రమైన సంక్షోభంలో కూరుకుపోయిందని, దీని నుంచి బైటపడటానికి ప్రజలు అపారమైన త్యాగాలకు సిద్ధంకావాలని ఉపన్యాసాలిస్తున్నారు. ఈ ఆర్థిక సంక్షోభం సృష్టికర్తలెవ్వరు అన్న విషయాన్ని ఏమీ ఎరగనట్లు నటిస్తున్నారు. ఈ ఆర్థిక విధానాల రూపకల్పనలో ఎటువంటి పాత్రలేని ఈ దేశపు కోట్లాది పీడిత ప్రజానీకాన్ని ఈ ఆర్థిక విధానాల దుష్పరిణామాలకు బాధ్యుల్ని చేస్తున్నారు. నేడు నూతన ఆర్థిక విధానాల పేరుతో అమలు జరుప బడుతున్న విధానాలు, అధికార మార్పిడి జరిగినప్పటి నుంచీ కొనసాగుతున్న ఆర్థిక విధానాల కొనసాగింపుగా వేగిరపర్చడమే తప్ప వేరుకాదనేది టి.ఎన్. 'తాకట్టులో భారతదేశం' అధ్యయనం చేస్తే మనకు అర్థం అవుతుంది.

ఆ రోజున కోర్టులో ఈ దేశం యొక్క ఆర్థిక పరిస్థితిని ఎంతలా దివాళా తీయిస్తున్నారో, ఈ దివాళాకోరు ఆర్థిక విధానాల మూలంగా ప్రజల్లో సంక్షోభం తీవ్రమైపోయి, సంక్షోభాల ఫలితంగా విధిలేక వీధుల్లోకొచ్చిన ప్రజానీకాన్ని తీవ్రమైన అణచివేతకు గురిచేస్తున్న ఈ ప్రభుత్వాల, పాలకుల దుర్మార్గమైన విధానాలను ఆయన తీవ్రంగా నిరసిస్తున్న సమయాన ఈ దేశపు సర్కారీ ఆర్థికవేత్తలు, మేధావులు నోళ్ళు మూసుకొని ప్రభుత్వానికి మౌన మద్దతులు పలికారు. అదే సర్కారీ అర్థ శాస్త్రవేత్తలు ఈ రోజున దేశ ఆర్థిక పరిస్థితి పూర్తిగా దివాళా తీసిందని ప్రకటనలు చేస్తున్నారు. మరోవైపు 'వామపక్ష' అర్థశాస్త్రవేత్తలుగా చెప్పుకొన్నవారు, టి.ఎన్. చేసిన విశ్లేషణలను ఉగ్రవాదమని గేలిచేసిన వారు, ఈ రోజున దేశం అప్పుల ఊబిలో కూరుకు పోయిందనే 'కొత్త' విషయాన్ని కనుక్కొన్నట్లుగా డంబాలు పలుకుతున్నారు. కనీసం నేడు పలుకుతున్న ఈ పలుకులకు అనుగుణంగా ప్రజాకార్యాచరణకు కదిలే పరిస్థితి నేటికి కూడా లేకపోవడం అంటేనే ఈ వామపక్ష మేధావుల దివాళాకోరు రాజకీయ ఆచరణ మనకు అర్థం అవుతుంది. కనీసం టి.ఎన్. ఆనాడే ఈ విషయాన్ని చెప్పారన్న చారిత్రక సత్యాన్ని కూడా మరుగుపర్చడానికి విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. కేవలం ఆర్థిక విషయాలే కాకుండా, ఈ వినాశకర ఆర్థిక విధానాల ప్రాతిపదికగా అమలయ్యే రాజకీయ విధానాలు ఈ దేశపు కోట్లాది పీడిత ప్రజానీకానికి ఎంతటి ద్రోహం చేస్తున్నాయో, అంతిమంగా ఈ దేశ పీడిత ప్రజానీకం బడా భూస్వామ్య, దళారీ బూర్జువా, సామ్రాజ్యవాద రథచక్రాలకు ఎలా కట్టివేయబడుతున్నారో ఆయన తన తార్కికమైన రాజకీయ, ఆర్థిక విశ్లేషణలను వివరించి ఈ దేశ ప్రజానీకాన్ని, ప్రజాతంత్ర మేధావి వర్గాన్ని వెన్నుతట్టి లేపడానికి కృషిచేశాడు. ఆయన ఆనాడు కోర్టులో చేసిన ప్రకటన ఈ నాటికీ సరిపోలిక (రిలవెన్స్‌ను) కల్గి ఉంది. ఆయన చెప్పిన సంక్షోభం మరింత తీవ్రమై ఎలా ఈ దేశ పీడిత ప్రజానీకాన్ని ఉరికొయ్యలకు వేలాడేట్లు చేస్తున్నదో మనం పరిశీలిద్దాం!

ఆర్థిక సమానత్వం లేని రాజకీయ సమానత్వం అనేది ఒక మాయ (without economic equality, political equality is a myth) అనే రాజకీయ అర్థశాస్త్ర సూత్రాన్ని గమనంలోకి తీసుకొంటే, మనదేశంలో రాజకీయ సమానత్వం ఎంత గొప్ప స్థాయిలో ఉంటుందో మనకు అర్థమయి తీరుతుంది. భారతదేశానికి అతి పెద్ద ప్రజాస్వామిక, గణతంత్ర రాజ్యాంగాన్ని తయారుచేశామని, ఈ రాజ్యాంగం ప్రాతిపదికన సర్వమానవ సమానత్వం నెలకొల్పబడుతుందని, వాక్, సభా, సంఘ స్వాతంత్ర్యాలు గ్యారంటీ చేయబడ్డాయని ఈ దేశపు రాజ్యాంగ నిపుణులు ఘోషించారు. ఈ రాజ్యాంగం అతి పవిత్రమైన, అతి పూజనీయమైన గ్రంథమని ఘోషించారు. సరిగ్గా ఈ వాదనలలోని బూటకత్వాన్ని కా॥ నాగిరెడ్డి ఇలా ఎండగట్టారు: "మన రాజ్యాంగం సామ్రాజ్యవాదులచే ఎంతో జాగ్రత్తగా ఎంతో శ్రమపడి వేసిన పునాదులపై నిర్మించబడిన ఉపరితల నిర్మాణం మాత్రమే! అప్పటికే ఉన్న న్యాయవ్యవస్థను, పరిపాలనా వ్యవస్థను, వాటి చట్టాలు, నియమ నిబంధనలతో సహా చట్టబద్ధం చేయటం, అప్పటికి అమలులో వున్న సామాజిక ఆర్థిక వ్యవస్థను మరింత బలీయం చేయటం ఈ నూతన రాజ్యాంగం యొక్క అసలు ఉద్దేశ్యం. ఈవిధంగా "జాతీయ నాయకత్వం" పేరిట ప్రాతినిధ్యం వహించిన బూర్జువా వర్గం భారత ప్రజలను విద్రోహానికి గురి చేయటాన్ని ఈ రాజ్యాంగం పూర్తి చేసింది. నూతన

రాజ్యాంగాన్ని ఆమోదించటంలో అప్పటికున్న నిర్మాణ వ్యవస్థను పదిలంగా వుంచుటకు, దానికి ఏమాత్రం దెబ్బ తగలకుండా వుండటానికి భారత బూర్జువావర్గం దేశంలో అధికారాన్ని స్వీకరించింది" (పేజీ 13). ఈవిధంగా పుట్టుకలోనే అష్టావక్ర పుట్టుకగా ఉన్న ఈ రాజ్యాంగం ఆధారంగా పరిపాలించబడే ఈ దేశంలో రూపొందించే ఆర్థిక, రాజకీయ విధానాలు ఏ వర్గానికి దాసోహం అవుతామో, ఏ వర్గం యొక్క ప్రయోజనాలకు దెబ్బతగులకుండా కాపలా కాస్తాయో టి.ఎన్. వివరిస్తూ, తన గత 25 ఏండ్ల అనుభవాల ప్రాతిపదికగా సంఘటనలతో సైతం వివరిస్తూ కుట్రదారులెవరో తేల్చమని భారత న్యాయవ్యవస్థకు 'సవాల్' విసిరాడు.

భారత ఆర్థిక వ్యవస్థ ఎటువంటి సంక్షోభం ఎదుర్కోవడంలేదని, భారతదేశంలో అభివృద్ధి స్వర్ణ రథచక్రాలతో పురోగమిస్తోందని నెహ్రూ నుంచి, ఇందిరాగాంధీ వరకు ఆర్థిక విధానాలు అన్నీ సజావుగా నడుస్తున్నాయనే ప్రచారం చేశారు. ఐ.ఎం.ఎఫ్.లాంటి వాటి దగ్గర తీసుకునే అప్పులను బహిరంగపరచేవారు కాదు. వాటికున్న నిబంధనలను బహిర్గతం చేసేవారు కాదు. ఆనాడు కా॥ నాగిరెడ్డి లాంటి విప్లవకారులు ఈ ప్రభుత్వ దళారీ, దోపిడీ ఆర్థిక విధానాలను, పీడిత ప్రజానీకాన్ని బలిపశువులుగా మార్చబోయే ఈ ఆర్థిక విధానాల దుష్పరిణామాలను ప్రజలకు అందచేయడంలో అగ్రభాగాన నిలబడ్డారు. ఇందుకోసం వాళ్ళపై తీవ్రమైన అణచివేత, కుట్రకేసులు బనాయించ బడ్డాయి. న్యాయస్థానం సాక్షిగా నాగిరెడ్డి ఈదేశ ఆర్థిక వ్యవస్థపై సామ్రాజ్యవాదుల పట్టును, ఈ దోపిడీ పాలకుల బడా బూర్జువా, భూస్వామ్య శక్తుల ప్రభావాన్ని బహిర్గతం చేశారు.

భారత ఆర్థిక వ్యవస్థ సర్వవ్యాప్త సంక్షోభంలో కూరుకుపోయిందని, వ్యవసాయ, పారిశ్రామిక ఉత్పత్తుల రేట్లు గణనీయంగా క్షీణించాయని, ఉత్పత్తి శక్తులయిన ప్రజల కొనుగోలుశక్తి నశించి, అష్టకష్టాలు పడుతున్నారని టి.ఎన్.హెచ్చరించాడు. వ్యవసాయ రంగంలో భారత దళారీ పాలకులు అనుసరించిన ఆర్థిక విధానాలు ఏకకాలంలో రైతాంగాన్ని, రైతాంగంపై ఆధారపడిన గ్రామీణ చేతివృత్తుల వారిని; వ్యవసాయాధార పరిశ్రమలలోని కార్మికవర్గాన్ని తీవ్రమైన సంక్షోభంలోకి నెట్టివేశాయి. "హరితవిప్లవం" వాస్తవంలో అనేక వ్యవసాయ ఉత్పత్తులు గణనీయంగా పడిపోయేట్లు చేసింది. ఎంపిక చేయబడిన ప్రాంతాలలో ఎంపిన చేయబడిన పంటల అభివృద్ధినే మొత్తంగా వ్యవసాయరంగ అభివృద్ధి అని బూర్జువా అర్థ శాస్త్రవేత్తలు దిక్కులు పిక్కటిల్లేలా తప్పుడు ప్రచారాన్ని లంకించుకొన్నారు. వాస్తవంగా జరిగిన అభివృద్ధి ఏమిటి? ఈ జరిగిందని చెప్పబడిన అభివృద్ధి ఫలాలు ఎవరికి చెందాయి? జరిగిందని చెప్పబడుతున్న అభివృద్ధి దీర్ఘ కాలంలో ఏ వర్గప్రయోజనాలు కాపాడబోతుందో ఆయన స్పష్టంగా విశదీకరించారు. అధికారిక లెక్కలనే (గణాంకాలనే) ఉటంకిస్తూ భారత వ్యవసాయ రంగంపై ఆయన చేసిన విశ్లేషణ నేటికీ వాస్తవికతను కల్గివుంది. ఆయన చేసిన నిర్ధారణల ప్రకారం "భారతదేశంలో ఒక్క గోధుమ విషయంలో మినహా వ్యవసాయ పంటల ఉత్పత్తిలో ఏటికేడాదికి అభివృద్ధి రేట్లు గణనీయంగా పడిపోయినట్లు బయట పడుతుంది. ఆహార విలువలు అత్యధికంగా ఉండే పప్పుదినుసుల విషయంలోనూ, ప్రధాన పారిశ్రామిక ముడి సరుకు అయిన వేరుశనగ విషయంలోను అభివృద్ధి రేట్లు తిరోగమనంలో ఉన్నాయి. అంత కంతకూ విదేశీ మారకద్రవ్యం హెచ్చుగా వెచ్చిస్తున్న నూనెగింజలు, ప్రత్తిలాంటి ప్రధాన పంటల ఉత్పత్తిలో 1960-61 నుండి 1968-69 మధ్యకాలంలో పెరుగుదల శూన్యం. వ్యవసాయ ఆర్థిక వ్యవస్థకు పారిశ్రామిక అభివృద్ధికి ముప్పుకలిగించే ధోరణి". (తాకట్టులో భారతదేశం పేజీ 21,22) మొత్తంగా వ్యవసాయ రంగ ఉత్పత్తి 70వ దశకంలో బాగా దెబ్బతిన్నది. 1950-60 మధ్యకాలంలో 3.75% పెరుగుదల రేటు 1960-70 మధ్య కాలంలో 1% కంటే తక్కువకు దిగజారిపోయింది. ఈ సందర్భంగా టి.ఎన్. వ్యవసాయ ధరల కమీషన్ నివేదికను ఉటంకిస్తూ ఒక అద్భుతమైన సూత్రీకరణను న్యాయస్థానంలో చేశారు.

ఈ ప్రభుత్వం, ప్రచార సాధనాలు బాకాలూదినట్లు "ఆహారధాన్యాల ఉత్పత్తి అలా పెరిగినా కూడా దేశంలో అప్పటికీ ఆహారధాన్యాల కొరతే ఉంటుంది. కానీ ప్రజలలో కొనుగోలు శక్తి నశించి పెరుగుతున్న దారిద్ర్యం వలన ఈ 'లోటే', 'మిగులు'గా కూడా కావచ్చును. అప్పుడు ప్రభుత్వం ఆహార రంగంలో అసాధారణ విజయం సాధించినట్లుగా సగర్వంగా బాకాలూదుకోవచ్చు. డోలు వాయించుకో వచ్చును". సరిగ్గా 1970లలో ఉద్ఘోషించినట్లు 1996లో జరిగిన పార్లమెంట్ ఎన్నికలలో గ్లోబలైజేషన్ 'రావు', 'మన్మోహన్'లు భారతదేశం ఆహార ధాన్యాలలో మిగులు సాధించిందని, అమెరికన్ గోధుమలు దిగుమతి చేసుకొనే స్థితి నుంచి అద్భుతంగా ఆహారధాన్యాలు మిగులును సాధించామని నిలువెత్తు పోస్టర్ల ప్రచారం సాగించారు. సరిగ్గా టి.ఎన్. చెప్పినట్లు దేశంలో దారిద్ర్యం మితిమీరిపోయి, దారిద్ర్యరేఖకు దిగువ జీవించే ప్రజానీకం రాశి పెరిగి కొనుక్కునే శక్తిలేని మూలంగా ఏర్పడిన 'మిగులు'ను మిగులుగా తమ ఘన విజయంగా చెప్పుకొంటున్న ఈ దేశ దళారీ పాలకులను దేశభక్తులందామా? ఈ స్థితిని 25 ఏళ్ళక్రితమే ఊహించిన కా॥టి.ఎన్.ను ఉగ్రవాది అందామా?

సోషలిస్టు నెహ్రూ "దేశాన్ని పారిశ్రామికవంతం చేయడమే భారత ప్రణాళికా వ్యూహం" అని గంభీరంగా ప్రకటించాడు. ఈ ప్రకటననే న్యాయస్థానంలో కా॥ నాగిరెడ్డి చెప్తూ ఆచరణలో భారతదేశంలో పారిశ్రామికీకరణ అనేది ఎంత బూటకమైన అంశంగా ఉందో సోదాహరణంగా వివరించారు. భారత పారిశ్రామిక రంగం సోషల్ సామ్రాజ్యవాది రష్యా భల్లూకపు పట్టులో చిక్కుకుపోవడాన్ని ఒక బ్రహ్మాండమైన అభివృద్ధిగా కీర్తిస్తున్న నెహ్రూ, నెహ్రూ 'సోషలిస్టు' విధానాలకు మురిసిపోతూ రాజుని మించిన రాజభక్తిని ప్రదర్శించడంలో అగ్రభాగాన నిలబడుతున్న రివిజనిస్టు, నయా రివిజనిస్టు పార్టీల నాయకత్వం యొక్క విద్రోహకర పాత్రను న్యాయస్థానంలో కా॥ నాగిరెడ్డి బదాబదలు చేశారు. మొత్తం జనాభాలో అధికభాగం పారిశ్రామిక రంగంలో కేంద్రీకృతమయ్యే అవకాశమే లేని 20 ఏండ్ల ప్రణాళికాబద్ధ ప్రగతిని టి.ఎన్. నిరసించాడు.

"స్వాతంత్ర్యం" వచ్చిన 25 సం॥ల తర్వాత, ప్రణాళికాబద్ధ ఆర్థిక విధానాలు అమలవుతున్నాయని చెప్పబడిన తర్వాత కూడా ప్రపంచంలో అతి పేద దేశాలుగా పేర్కొనబడుతున్న మొరాకో, టాంజానియాలాంటి దేశాలకు సమాన స్థాయిలోనే భారతదేశ

పారిశ్రామిక రంగంలో ఉద్యోగిత శాతం (Employment percentage) ఉండటాన్ని నిరూపిస్తూ ఈ ప్రణాళికాబద్ధ ప్రగతిని, నెహ్రూ సోషలిస్టు బూటకత్వాన్ని ఎండగట్టి దేశద్రోహులెవ్వరో తేల్చమని డిమాండ్ చేశారు. భారత దళారీ బూర్జువావర్గం వెన్నెముకలేనిదని చాటిచెప్తూ, సామ్రాజ్యవాదులు ఉత్పత్తి చేసే పారిశ్రామిక ఉత్పత్తులను అమ్మకంచేసే దళారీ పాత్రనే అది పోషించడానికి ఇష్టపడుతోందని; స్వతంత్ర, ప్రజాతంత్ర పారిశ్రామిక విధానాన్ని ఈ దళారీ బూర్జువా వర్గానికి నేర్పే కర్తవ్యం ఈ దళారీ పాలకులకు లేదని ఆయన ఘోషించాడు. పిన్ను నుంచి సమస్తం తయారీలో సామ్రాజ్యవాదుల "నైపుణ్యతపై", "సాంకేతిక పరిజ్ఞానం"పై ఆధారపడిన ఈ దళారీ, దోపిడీవర్గ పాలకులు భారత ప్రజలకు ఒరగబెట్టేదేమీ ఉండబోదని టి.ఎన్. నిర్ద్వంద్వంగా ప్రకటించారు. మొత్తంగా పారిశ్రామికరంగం యొక్క స్థితిపై ఆయన సారాంశంలో ఇలా పేర్కొన్నారు. "బ్రిటీష్ సామ్రాజ్యవాదం నుంచి వారసత్వంగా పొందిన వలస ఆర్థిక వ్యవస్థను మార్చే కర్తవ్యాన్ని చేపట్టకుండా దాటవేయడమే భారత పాలకుల పారిశ్రామిక నినాద సారాంశం.విదేశీ పెట్టుబడితోనూ, అర్థఫ్యూడల్ భూస్వామ్య ఆర్థిక నిర్మాణంతోనూ నేరుగా ఢీకొనకుండా దాటవేయడమే ఇది". ఖచ్చితంగా టి.ఎన్. చెప్పిన దానికి అనుగుణంగానే ఈ రోజున భారత పారిశ్రామికరంగంలో తరుగుతున్న ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లేదా మూలాధార పరిశ్రమలైన ఇనుము-ఉక్కు, సిమెంట్ తదితర రంగాలు సంక్షోభంలో కొట్టుమిట్టాడుతూ ఉంటే బహుళజాతి రాబందుల వినియోగ వస్తువులు ఉత్పత్తిచేసే పరిశ్రమలు రెక్కలు విప్పుకొని విస్తరించడం – దీనినే పారిశ్రామిక అభివృద్ధిగా కీర్తించడం నెహ్రూ కాలం నాటి ఆర్థిక విధానాలను త్వరితగతిలో, మరింత వేగవంతంగానూ కొనసాగించే ప్రక్రియే ఇది.

భారతదేశంలో ప్రణాళికాబద్ధంగానూ, 'స్వతంత్ర' ఆర్థిక విధానాలు అమలు చేయడం ద్వారానూ, భారతదేశపు జాతీయ ఆదాయాన్ని, తలసరి ఆదాయాన్ని పెంచగల్గుతామని, తద్వారా భారత్‌ను సంపన్న దేశాల సరసన నిలబడేట్లు చేయగల్గు తామని ప్రతి ప్రణాళికా డాక్యుమెంట్‌లోనూ ఈ ప్రణాళికా డాక్యుమెంట్ల రచయితలు, పాలకవర్గాలు ఊదరకొట్టారు. కాని వాస్తవంలో జరిగిందేమిటి? జాతీయాదాయం-తలసరిఆదాయాల పెరుగుదలలో స్థిరత్వం మాత్రమే సాధించామని ఈ పాలక వర్గాలే పేర్కొంటున్నాయి. స్థిరత్వం ఉంది అంటేనే పెరుగుదల లేదని, అభివృద్ధి ఆగిపోయిందని చెప్పకనే చెప్తున్న మాటల లోగుట్టును టి.ఎన్. బట్టబయలు చేశారు.

వాస్తవంగా భారతదేశంలో ఆదాయం కొద్దిపాటి కుటుంబాల గుత్త ఆస్థులుగా మిగిలిపోయిన వైనాన్ని, దేశంలో కోట్లాది పీడిత ప్రజానీకం తమ ప్రాణాలు నిలబెట్టుకోవడానికి విషపూరితమైన ఆహారం సైతం తినడమో లేదా తమ కన్నబిడ్డలను సైతం అమ్ముకొనే దౌర్భాగ్య పరిస్థితులకు దిగజారడమో వెనుక పనిచేస్తున్న ఈ అదృశ్యహస్తాలు ఎవరివంటూ టి.ఎన్. ఆగ్రహంగా వేసిన ప్రశ్నకు నేటికీ జవాబు లేదు. టి.ఎన్. ఉదహరించినట్లుగా "అస్సాంలోని గోపాల్‌పరా జిల్లాలో వెనుకబడిన కులానికి చెందిన ఒక తండ్రి తన 14 ఏళ్ళ కూతుర్ని 5 మణుగుల వరిధాన్యాల కొరకు కుదువబెట్టాడనే సమాచారం ఒక ప్రశ్నకు సమాధానంగా 1970 ఫిబ్రవరి మొదటివారంలో ఈ దేశపు అత్యున్నత శాసన నిర్మాణ సంస్థ అయిన లోక్‌సభలో వెల్లడించబడింది". ఈరోజుకీ ఈ పరిస్థితుల్లో ఏమైనా మార్పు వచ్చిందా? ఈ దేశ పాలకులు దేశద్రోహులు అని గర్జించిన టి.ఎన్. గర్జనలో ఆవగింజంత అబద్ధాన్ని మనం కాగడాలు వేసి వెదికి పట్టుకోగలమా? గుక్కెడు గంజినీళ్ళకోసం ఇంటిల్లిపాదీ వెట్టి చాకిరీ చేయడమో, భూస్వామ్య బంధనాలలో లైంగిక వేధింపులకు నిరంతరం గురికావడమో, అత్యంత ప్రమాదకరమైన పరిశ్రమలలో అతి తక్కువ వేతనాలకే ప్రాణాలు బలిపెడుతున్న కార్మిక సోదరుల ఆకలికేకల ఆర్తనాదాలను ఈ పాలక వర్గాలు ఏమాత్రమైనా పట్టించుకోగలిగే స్థితిలో ఉన్నాయని నమ్మగలమా? ఈ పరిస్థితులన్నింటిని 21 సం॥ క్రితం ఊహించిన టి.ఎన్. దార్శనికతను కాదనగలమా? మొత్తంగా ఈ పరిస్థితిని అధ్యయనం చేసి, విశ్లేషించిన టి.ఎన్. తమను కుట్రదారులు గానూ, దేశద్రోహులుగానూ పేర్కొంటున్న ఛార్జిషీట్‌ను ధిక్కరిస్తూ మొత్తంగా భారతదేశపు జాతీయ ఆదాయం, తలసరి ఆదాయాల గురించి వ్యాఖ్యానిస్తూ ఈవిధంగా పేర్కొన్నారు. "భారత దేశాన్ని వెనుకనుండి ముందు స్థానంలో నిలపడానికి ఎంతో ఆతృతపడుతున్న భారత పాలకవర్గాలు ఎంతటి మహత్తర కర్తవ్యాన్ని నిర్వహిస్తున్నాయి?! ముందు వరుసలో ప్రథమ స్థానం ఎలాగూ సాధించలేం కనుక కనీసం వెనుక నుంచైనా ప్రథమ స్థానం సంపాదించటం నిజంగా హిమాలయా లంతటి బ్రహ్మాండమైన విజయమేకదా! గాంధీ, నెహ్రూల యుగం అహింసామూర్తులు, సత్యాన్వేషులు అయిన ఈ మోక్షగాముల మార్గ దర్శకత్వంలో, నాయకత్వంలో రామరాజ్యం వైపుకి "సోషలిస్టు తరహా సమాజ" నిర్మాణం వైపుకి సాగుతున్న ఈ మహత్తర దేశభక్తియుత మహాప్రస్థానంలో ఎంత గొప్ప విజయం ఇది! అమాయకులైన సామాన్య ప్రజల్ని మోసగించడంలో "దేశ భక్తులని " పోజుపెడుతున్న ఈ "దేశద్రోహులను" మించిన వారెవ్వరూ లేరని చెప్పవచ్చు. టి.ఎన్. చెప్పినట్లు ఈ "దేశద్రోహుల" పాలనలో "ప్రపంచీకరణ, సరళీకరణ, గ్లోబలైజేషన్‌ల పేరుతో దేశం టి.ఎన్. చెప్పిన విజయాలను సాధించడానికి శరవేగంతో దూసుకుపోతున్న దృశ్యం ఈ దేశపు కోట్లాది శ్రమజీవుల ముందు సాక్షాత్కరిస్తోంది"!

భారతదేశంలో సామ్రాజ్యవాదులు సహాయం పేరుతో చేస్తున్న దోపిడీ యొక్క బహుముఖ రూపాలను టి.ఎన్. ప్రశ్నించారు. సామ్రాజ్యవాదులు చేస్తున్న ఈ ఆర్థిక సహాయానికై కమ్యూనిస్టు దేశంగా చెప్పుకొంటున్న సోవియట్ రష్యా యొక్క అసలు రూపమైన సోషల్ సామ్రాజ్యవాద స్వభావాన్ని టి.ఎన్. బట్టబయలు చేశారు. మొదటి పంచవర్ష ప్రణాళికా కాలం నుంచి నిరంతరం (Rolling) ప్రణాళికలు అమలు జరుపబడిన 1966-67, 1967-68, 1968-69 వరకు భారత దేశంలోకి ఇబ్బడిముబ్బడిగా దిగుమతి అవుతున్న 'సహాయం' యొక్క స్వభావాన్ని సామ్రాజ్యవాద దేశపు మేధావుల రచనలనుటంకిస్తూ ఆయన చేసిన సుదీర్ఘ ఉపన్యాసం చారిత్రాత్మకమయినది. 'సహాయం' పెరిగిన తర్వాత, సహాయాలు తగ్గిపోయి అప్పులు విపరీతంగా పెరిగిపోయి ఈ దేశం అప్పుల ఊబిలో కూరుకుపోతుంది. సహాయం చేసే దేశాలు తమ విదేశీ ఫైనాన్స్ పెట్టుబడి ప్రయోజనాలకు అనుగుణ్యంగా భారత ఆర్థిక విధానాలు డిజైన్ చేయబడాలనే ఒత్తిడులు తీవ్రమౌతాయి. ప్రపంచాన్నంతా అమెరికనైజ్ చేయడమే మన లక్ష్యం అని

అమెరికా ఒకప్పటి అధ్యక్షుడు రూజ్‌వెల్ట్ ప్రకటించాడు. దానికనుగుణంగానే ఈ 'సహాయం', 'అప్పులు', 'తక్కువ వడ్డీలతో అప్పులు' అనే వివిధ రకాల పేర్లతో, పేరేదైనా ఒకటే దోపిడీ స్వభావంతో భారతదేశంలో అమెరికన్ దోపిడీ కొనసాగుతుంది. తృతీయ ప్రపంచదేశాలు 'అభివృద్ధి'లో పాల్గొనడం ద్వారానే ఆయా దేశాల అభివృద్ధిని మన ప్రయోజనాలకు అనుగుణంగా నడిపించుకోవడానికి అవకాశం లభిస్తుందని అత్యంత నగ్నంగా అమెరికా విదేశీ వ్యవహారాల కమిటీ సమర్పించిన నివేదిక పేర్కొంటుంటే, అమెరికన్ సామ్రాజ్యవాదుల దయాదాక్షిణ్యాల గురించి, వాళ్ళు దిగుమతి చేస్తున్న గోధుమ గింజల గొప్పతనం గురించి ఈ అహింసా ప్రభువులు బోధిస్తుంటే కోట్లాది శ్రామికజనం విద్రోహానికి గురైనారని మనం భావించకుండా ఉండగలమా? అని టి.ఎన్. సూటిగా ప్రశ్నించాడు.

'సహాయం' పేరుతో అమెరికా భారతదేశానికి దిగుమతుల ఖర్చులను ఎలా పెంచుతుందో, నిబంధనల ఉచ్చులో బిగించి ఆంక్షల సంకెళ్ళలో ఈ దేశ పీడిత ప్రజానీకం మూల్గులను ఎలా పీల్చి వేస్తుందో టి.ఎన్. సోదాహరణంగా వివరించారు. అమెరికా సహాయంతో కొనుగోలుచేసే అమెరికన్ ఎరువులలో సగభాగం అమెరికా ఓడలలోనే రవాణా చేసుకోవాలని భారతదేశాన్ని ఒత్తిడి చేయడం వలన అమెరికా నుంచి భారతదేశానికి దిగుమతి అయ్యే ఎరువుల రవాణా ఖర్చులు విపరీతంగా పెరుగుతాయి. తక్కిన దేశాలు ఒక బస్తా రవాణాకు 15 డాలర్లు వసూలు చేస్తుంటే అమెరికా 44 డాలర్లు వసూలు చేస్తుందని టి.ఎన్. వివరించారు. ఈవిధంగా పెరిగిపోయిన ఎరువుల రేట్లతో భారత రైతు ఉరికొయ్యకు వేలాడే పరిస్థితి వస్తుందని హెచ్చరించాడు. టి.ఎన్. చేసిన హెచ్చరికలు అక్షరసత్యాలై వందలాది రైతాంగం భార్యాపిల్లలతో సహ ఆత్మహత్యలు చేసుకొంటున్న నేటి హృదయ విదారక దృశ్యాలకు మూలాలు ఎక్కడున్నాయో మనకు అర్థం చేయిస్తుంది. టి.ఎన్. చేసిన హెచ్చరికలు పెడచెవిన పెట్టిన పాలకవర్గాలు, టి.ఎన్.ను కుట్రదారుగా, ఉగ్రవాదిగా చిత్రించిన ఈ పాలకవర్గాలు, వాళ్ళ తాబేదార్లయిన న్యాయస్థానాలు నేడు ప్రజలకు ఏమని సమాధానం చెప్తాయి? మొత్తంగా ఈ దోపిడీకి, అతి నీచమైన విద్రోహానికి పాల్పడిన ఈ పాలకవర్గాల వలసవాద ప్రభువుల యొక్క అసలు ఉద్దేశ్యాలను టి.ఎన్. సమగ్రంగా ఇలా చెప్పారు. "సామ్రాజ్యవాదులు ఒక నూతన రూపంలో దోపిడీని, అదే నయావలస విధాన రూపంలో అమలు చేస్తున్నారు. తమ ప్రత్యక్ష వలస పాలన అనే పాత పద్ధతిని మార్చుకొని వలస దేశాలలో తాము ఎంపిక చేసుకొని శిక్షణ ఇచ్చిన తమ ఏజంట్లపై ఆధారపడి కొత్త వలస పాలనా దోపిడీ పద్ధతులను అనుసరించడం వారికి తప్పని సరైంది. వీరి నయావలస విధానపు ప్రత్యేక లక్షణమిది". ఆంగ్లో-అమెరికన్ సామ్రాజ్యవాదుల ఏజెంట్లుగా గులాంగిరీ చేయడంలో నెహ్రూ మొదలుకొని మొత్తంగా పేర్లేవైనా పాలకులందరూ ఒకరిని మించి ఒకరు పోటీ పడుతున్నారన్నది సత్యం. గత 50 ఏండ్ల స్వతంత్ర భారత చరిత్ర బుజువుచేసిన తిరుగులేని సత్యమిది.

స్టాలిన్ మరణానంతరం కృశ్చేవ్ రివిజనిస్టు ముఠా అధికారం చేజిక్కించుకొన్న తర్వాత సోషల్ సామ్రాజ్యవాద పెట్టుబడి, తూర్పు యూరప్ దేశాల పెట్టుబడులు మనదేశంలో పరవళ్ళు తొక్కుతూ ప్రవహించాయి. ప్రధానంగా ప్రభుత్వరంగ పరిశ్రమల్లో ఈ పెట్టుబడుల కేంద్రీకరణ సాగుతుండగా మరోవైపు అమెరికన్ డాలర్ల వరద ఈ దేశపు ప్రైవేట్ పారిశ్రామికవేత్తలకు ప్రవహించింది. అమెరికా ప్రైవేటు పారిశ్రామికవేత్తలకు బుణాలిచ్చేటప్పుడు ఖచ్చితమైన నిబంధనలు విధించిందని, తన ప్రయోజనాలకనుగుణంగానే ఈ పెట్టుబడుల వరదను అమెరికా సృష్టిస్తోందని భారత అమెరికా సహకారంపై 'కామర్స్' పత్రిక ప్రచురించిన నివేదిక ఆధారంగా టి.ఎన్. విస్పష్టమైన నిర్ధారణలు చేశాడు. దేశంలో నిర్వహించబడుతున్న అమెరికన్ వ్యవసాయ ఉత్పత్తులు విడుదల చేసేందుకు ఉపకరించే సంస్థలు ఉదా: ధాన్యాన్ని నిల్వచేసే స్థానిక ప్రైవేటు గిడ్డంగులు లేదా ధాన్యాన్ని ప్రోసెసింగ్ చేసే పిండిమరలు వగైరాలకు మాత్రమే అమెరికన్ పెట్టుబడుల నిధులు ప్రవహించాలని కామర్స్ ప్రచురించిన 'కూలీ నిధులు' నుంచి ఎటువంటి సంస్థలు బుణాలు పొందగలవో వివరించింది.

భారత దేశంలోకి ప్రవహిస్తున్న ఈ పెట్టుబడులలో అధికశాతం ఈ దేశపు బడా దళారీ బూర్జువావర్గ శిబిరానికి నాయకులుగా వున్న టాటా, బిర్లా కుటుంబాలకే ఎలా పరిమితమైందో కూడా నాగిరెడ్డి వివరించారు. ఈ దళారీ బూర్జువాల ఆస్థులు పెరగడానికి వీళ్ళ స్వయంచాలక శక్తి కారణంగా కాక అమెరికన్ సామ్రాజ్యవాదుల బూట్లు నాకే వెన్నెముకలేని వైఖరులే కారణం అన్నది ఆయన చాలా స్పష్టంగా చెప్పారు. అల్యూమినియం, రసాయనాలు, మందులు, ఎరువులు, రవాణా, భారీ ఇంజనీరింగ్ వంటి పరిశ్రమల్లో గుత్తాధిపత్యం సంపాదించటానికీ, మన దేశపు వ్యూహాత్మక పారిశ్రామిక శిఖరాలను అమెరికా వశపర్చు కోవటానికి మాత్రమే ఈ దేశపు పాలకులు అనుసరించే ఆర్థిక విధానాలు సుగమం చేస్తున్నాయన్న ఆయన వాదన ఈనాడు అర్థశాస్త్రంలో ఓనమాలు తెలిసిన ప్రతీ ఒక్కరికీ అమెరికా గుత్తాధిపత్యానికి రహదారులు ఎప్పుడు పడ్డాయన్న విషయం అత్యంత సులభంగా అర్ధం అవుతుంది.

భారతదేశంలో పరిశ్రమలు స్థాపించడానికే ఫైనాన్స్ కార్పొరేషన్‌లు పెట్టామని చెప్పిన ఈ పాలకుల గంభీరవాగ్దానాలు సైతం ఆచరణలో దుష్పరిణామాలకే దారితీశాయి. పారిశ్రామిక రంగానికి బుణసహాయ సంస్థలుగా వున్న ప్రపంచబ్యాంక్, ఐ.ఎమ్.ఎఫ్., డబ్ల్యు.టి.ఓ.లలో సామ్రాజ్యవాద పెట్టుబడి సింహభాగాన్ని ఆక్రమించుకొంది. భారత పేద ప్రజల పొదుపు డబ్బుతో ఈ దేశపు బడా దళారీ బూర్జువాలు, విదేశీ మిలాఖత్‌దారులు మాత్రమే లాభాలు పొందారని ఆధారసహితంగా నిరూపించి, ఈ దేశపు పేద ప్రజల మూల్గులు పీల్చి పోగేసిన సంపద మొత్తాన్ని విదేశీ మిలాఖత్‌దార్లకు, బడా దళారీ బూర్జువాలకు ధారపోస్తున్న ఈ పాలకులను దేశద్రోహులందామా! దేశభక్తులందామా! అని టి.ఎన్. చేసిన సవాల్ తిరుగులేనిది.

ooooo